సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం | 25 | జూలై | 2025



చిట్టడవుల పెంపకం
మియావాకి (చిట్టి అడవులు) పద్ధతిలో ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో **10 వేల మొక్కలను నాటుతున్నారు.**

8లో ▸



గుర్రపుడెక్కతో ముంపు ముప్పు
కొల్లేరు ప్రాంతానికి ఏటా గుర్రపుడెక్క గుదిబండగా మారుతోంది. పెదఎడ్లగాడి వంతెన వద్ద డెక్క పేరుకుపోయింది.

8లో ▸



మావుళ్లమ్మ సన్నిధిలో కలెక్టర్
భీమవరం(ప్రకాశంచౌక్): మావుళ్లమ్మవారిని గురువారం కలెక్టర్ సీహెచ్ నాగరాణి మాతృమూర్తితో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

అందని సాయం.. అన్నదాత ఆక్రోశం

అన్నదాత దుఃఖీభవ
- వర్షాలతో ఊపందుకున్న తొలకరి పనులు
- పెట్టుబడుల కోసం రైతుల ఇక్కట్లు
- నీటితీరువా, బీమా ప్రీమియం భారం మోపిన కూటమి సర్కారు
- జూలై గడిచిపోతున్నా అన్నదాత సుఖీభవ ఊసెత్తని వైనం
- గత ప్రభుత్వంలో పక్కాగా సాయం విడుదల



సాక్షి, భీమవరం: సాగునీటి ఎద్దడి, ఎండలకు నత్తనడకన సాగిన ఖరీఫ్ సాగు అల్పపీడనంతో జోరందుకుంది. జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడుతుండటంతో రైతులు పనులు ముమ్మరం చేస్తున్నారు. ఈ తరుణంలో పంట పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది అన్నదాత సుఖీభవ సాయానికి ఎసరు పెట్టిన చంద్రబాబు సర్కారు ఈ సీజన్‌లో ఎప్పుడు ఇచ్చేది స్పష్టం చేయడం లేదు.

జిల్లాలో 2.08 లక్షల ఎకరాల్లో..

జిల్లాలోని 2.08 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగనుంది. జూన్ రెండో వారంలో కాలువలకు నీరు విడుదల చేసినా క్లోజర్ పనుల్లో తీవ్ర జాప్యం, సాగునీటి ఎద్దడి, వర్షాభావ పరిస్థితులతో పనులు ఆలస్యమయ్యాయి. పలుచోట్ల సాగునీరందక నారుమడులు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడ్డారు. నాలుగు రోజుల క్రితం నాటికి 40 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా జిల్లా అంతటా వర్షాలు పడుతుండటం తొలకరి పనులకు ఊతమిచ్చినట్టయ్యింది.

రైతులపై రూ.26.18 కోట్ల అదనపు భారం

రైతులకు ఊరటనిస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పక్కన పెట్టిన నీటి తీరువాను కూటమి తెరపైకి తెచ్చింది. పంట పొలాలకు ఎకరానికి ఏడాదికి రూ.350, ఆక్వా చెరువులకు రూ.500 చొప్పున గత మూడేళ్లకు జిల్లాలోని 3,31,169 మంది రైతుల ఖాతాల నుంచి వసూలుకు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు పాత బకాయిలు రూ.5.62 కోట్లు, వడ్డీ రూ.33.77 లక్షలు, ప్రస్తుత డిమాండ్ రూ.15.84 కోట్లు కలిపి రూ. 21.81 కోట్లు వసూలు చేసే పనిలో అధికారులు ఉన్నారు. మరోపక్క మాజీ సీఎం వైఎస్ జగన్ తెచ్చిన ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ఎత్తివేసి ప్రీమియం భారాన్ని రైతులపై మోపింది. ఎకరానికి రూ.210లు చొప్పున తొలకరిలో 2.08 లక్షల ఎకరాలకు రూ.4.37 కోట్లు ప్రీమియాన్ని ఆగస్టు 15లోపు రైతులు చెల్లించాల్సి ఉంది. సీజన్ ప్రారంభంలోనే నీటితీరువా, బీమా ప్రీమియం రూపంలో ఖరీఫ్ రైతులపై రూ.26.18 కోట్ల భారం పడింది. గడిచిన రబీ సీజన్‌లోని ధాన్యం బకాయిలు దాదాపు రూ.290 కోట్లను రెండు నెలలుగా ప్రభుత్వం చెల్లించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సాయంపై స్పష్టత ఏదీ ? అన్నదాత సుఖీభవ పేరిట ఏటా రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు మొదటి ఏడాది సాయానికి ఎగనామం పెట్టారు. ఇలా జిల్లాలోని రైతులు దాదాపు రూ.210 కోట్లు సాయాన్ని కోల్పోయారు. ఇప్పటికే ఖరీఫ్ ప్రారంభమై నెలన్నర కావస్తున్నాయి. సాయం విడుదల పేరిట జిల్లాలోని 1.05 లక్షల మంది రైతులకు ఈకేవైసీ పూర్తిచేశారు. కాగా ఎప్పుడు విడుదల చేసేది ప్రకటించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తుండటంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పంట పెట్టుబడులకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో సాగు ఆరంభంలోనే..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాగు ప్రారంభంలోనే వైఎస్సార్ రైతు భరోసా సాయం విడుదల చేశారు. పీఎం కిసాన్ రూ.6,000లకు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500లు జతచేసి ఏటా రూ.13,500లు మొత్తాన్ని మూడు విడతలుగా అందించేవారు. తొలి విడతగా మే నెలలోనే రూ.7,500, తొలకరి చివరిలో రూ.4,000, రబీలో రూ.2,000 చొప్పున అందించారు. ఇలా ఐదేళ్లలో జిల్లాలోని 1,17,999 మందికి రూ.796.49 కోట్ల లబ్ధి చేకూరింది. గత ప్రభుత్వ సాయాన్ని గుర్తుచేసుకుంటూ ప్రస్తుతం తొలకరి పనులు జోరందుకోవడంతో చేతిలో సొమ్ముల్లేక ఇబ్బంది పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

రైతులంటే చిత్తశుద్ధి లేదు



కూటమి ప్రభుత్వానికి రైతులంటే ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. అన్నదాత సుఖీభవ సాయం ఇవ్వకపోగా ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసింది. మూడేళ్లుగా లేని నీటి తీరువాను పాత బకాయిలతో వసూలు చేస్తోంది. ధాన్యం సొమ్ములకు చాలా ఇబ్బంది పెట్టింది. మూడు నెలల పాటు ధాన్యం డబ్బులు పడక సన్న, చిన్నకారు రైతులు చాలా ఇబ్బంది పడ్డారు.

– చిన్నం రామారెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు, పెనుగొండ

కారుమూరి కాన్వాయ్‌పై దాడి అమానుషం



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఏలూరు ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్

ఏలూరు (టూటౌన్): ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు అక్రమని, తణుకులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కాన్వాయ్‌ను అడ్డగించి మరీ జనసేన నాయకులు చేసిన వికృత చేష్టలు అమానుషమని వైఎస్సార్‌సీపీ ఏలూరు ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) ఖండించారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 13 నెలల వ్యవధిలో నిత్యం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తున్నారని, అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రతిపక్షాలను టార్గెట్‌గా చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మద్యం డిస్టిలరీలన్నీ గతంలో టీడీపీ హయాంలో ఏర్పాటుచేసినవే అని, అలాంటప్పుడు వైఎస్సార్‌సీపీ హయాంలో అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. తణుకులో మాజీ మంత్రి కారుమూరి కాన్వాయ్‌ను అడ్డగించి ప్రచార రథం ఎక్కిన జనసేన నాయకులు దివంగత వైఎస్సార్, మాజీ సీఎం జగన్ ఫొటోలను కాళ్లతో తొక్కడం హేయమన్నారు. సినిమాల పేరుతో రోడ్లను బ్లాక్ చేయడం, ట్రాఫిక్‌కు, సాధారణ జనజీవనానికి అంతరాయం కలిగించడం ఏమిటంటూ నిలదీశారు. జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్ గుర్నాథ్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుదీర్ బాబు, జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ నేరుసు చిరంజీవి, ఏలూరు నగర మహిళా విభాగం అధ్యక్షురాలు జుజ్జువరపు విజయనిర్మల, తంగేళ్లమూడి సురేష్, బసవ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బ్యాగుల నాణ్యతలో డొల్లతనం



హ్యాండిల్ తెగిపోయిన బ్యాగు

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన బ్యాగుల నాణ్యతలో డొల్లతనం బయటపడుతోంది. పట్టుమని పది రోజులు కూడా కాకుండానే బ్యాగులు చిగిరిపోతున్నాయి. ఆగిరిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి గురువారం పాఠశాలకు వెళుతుండగా బ్యాగ్ హ్యాండిల్ తెగిపోయింది. దీంతో ఇలా బ్యాగును చేతికి తగిలించుకుని తంటాలు పడుతూ బడికి వెళ్లాడు. మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఇచ్చిన బ్యాగులు జిప్పులు ఊడిపోవడం, చిగిరిపోవడం వంటివి జరుగుతున్నాయని, నాణ్యత లేని బ్యాగులు ఇవ్వడం ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొగాకు బోర్డులో నమోదు తప్పనిసరి

జంగారెడ్డిగూడెం: నారుమడులకు సిద్ధమయ్యే పొగాకు రైతులు పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్ చేయించుకుని రశీదు పొందాలని వేలం కేంద్రం నిర్వాహక అధికారి బి.శ్రీహరి గురువారం ప్రకటనలో తెలిపారు. పంట నియంత్రణలో భాగంగా నర్సరీ నుంచి నిబంధనలు కఠినతరం చేస్తున్నామని పేర్కొన్నారు. సీటీఆర్ఐ, ఐటీసీ సంస్థలు విత్తనాలు సరఫరా చేస్తాయని, వాణిజ్య రైతులు నారుమడులు 2 హెక్టార్ల వరకు విస్తీర్ణంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు. హెక్టారుకు రూ.500 రుసుం చెల్లించాలని సూచించారు. బోర్డులో రిజిస్ట్రేషన్ లేకుండా నర్సరీలు వేసే వారిపై చర్యలు తీసుకుంటామని, నమోదు చేయించుకున్న వారి జాబితాను బోర్డు వద్ద ప్రదర్శిస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ లేని నర్సరీల నుంచి నారు కొనుగోలు చేసి పొగాకు సాగు చేస్తే బేరన్, రిజిస్ట్రేషన్ నిలుపుదల చేస్తామని తెలిపారు.

ఆర్టీసీ స్థలాలను కాపాడుకుందాం



ఏలూరులో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విలువైన ఆర్టీసీ స్థలాలను, ప్రజల, ప్రయాణికుల అవసరాలకు కాకుండా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే చర్యలను స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వ్యతిరేకిస్తోందని యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి టీపీఆర్ దొర అన్నారు. గురువారం ఏలూరు డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు నిరసన చేపట్టారు. డిపో కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ముఖ్య అతిథిగా దొర మాట్లాడుతూ విజయవాడ గవర్నర్ పేట-2 డిపో, విజయవాడ పాత బస్టాండు స్థలాలను బహుళ జాతి సంస్థ 'లూలూ' షాపింగ్ మాల్‌కు ఇచ్చే ప్రతిపాదనలు విరమించుకోవాలన్నారు. ప్రయాణికులు భవిష్యత్తు రవాణా అవసరాలకు ఉపయోగపడే ఆర్టీసీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన ప్రభుత్వమే ఇలాంటి చర్యకు పూనుకోడాన్ని ప్రజలందరూ నిరసించాలని కోరారు. లూలూ షాపింగ్ మాల్ కోసం ఆర్టీసీ డిపోను మరో చోటకు తరలించాలని నిర్ణయించడం విచారకరమన్నారు. ఆర్టీసీని కాపాడుకోవడం కోసం ప్రజలు, ప్రయాణికులు, ప్రజా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. డిపో కార్యదర్శి టీకే రావు, జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్, జీవీ శాస్త్రి, సీహెచ్ నారాయణ, ఎ.రమేష్ ప్రసాద్, జీవీ రావు, పి.శ్యామల, బి.సూర్య కళ, వి.సూరన్న, జి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరు వేగిరపర్చాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు నిర్దేశించిన మేర రుణ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు, ఉపాధి యూనిట్ల గ్రౌండింగ్, తదితర అంశాలపై ఏలూరు కలెక్టరేట్ నుండి డీఆర్‌డీఏ ఏపీఎంలు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో 15,353 సంఘాలకు రూ.1,145.20 కోట్ల రుణాల మంజూరుకు మైక్రో క్రెడిట్ ప్లాన్‌లను బ్యాంకులకు అందించామన్నారు. ఇప్పటివరకూ 2,888 సంఘాలకు రూ.237 కోట్ల రుణాలను బ్యాంకులు ఆమోదించాయని, మిగిలిన రుణాలను కూడా ఆమోదించేలా డీఆర్‌డీఏ అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు.

అక్రమ ఇసుక గుట్టలను సీజ్ చేయాలి



ఆచంటలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సర్పంచ్‌లు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో అక్రమ ఇసుక గుట్టలను సీజ్ చేయాలని, మాఫియా ఇసుకను తోడేసి విక్రయిస్తుందంటూ సర్పంచ్‌లు గళమెత్తారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తవ్వుతూ గుట్టలుగా నిల్వ చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలంటూ ఆచంట డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరరావుకు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు సుంకర సీతారామ్, ఇళ్ల లక్ష్మీ చంద్రిక, జక్కంశెట్టి శ్రీరామ్, కోట సరోజినీ వెంకటేశ్వరరావు, గణేషుల శేషవేణి సుబ్బారావు, గుబ్బల ఉషారాణి వీర బ్రహ్మంలు మాట్లాడుతూ టీడీపీ నాయకుడు గణపతినీడి రాంబాబు మాఫియా డాన్‌లా వ్యవహరిస్తూ అక్రమంగా ఇసుక నిల్వ చేస్తున్నారన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ పరిధిలో 50 కిలోమీటర్ల వరకు ఇసుక తీసుకూడదనే నిబంధనలను పట్టించుకోవడం లేదన్నారు. కోడేరు, భీమలాపురం, కరుగోరుమిల్లి, సిద్ధాంతం, నడిపూడిల్లో ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేకున్నా వందలాది యంత్రాలతో కోట్లాది రూపాయల ఇసుకను తవ్వేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గాల్లో ఖాళీ ప్రదేశాలు ఇసుక గుట్టలుగా మారాయన్నారు. రాంబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. అలాగే ఇసుకను అక్రమంగా తవ్వి కొడమంచిలి, సిద్ధాంతంలోని ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్లలోనూ నిల్వ చేశారన్నారు. గెద్దాడ ఏకలవ్య, మెడిచర్ల పండు, గొట్టుముక్కల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన చేష్టలు బాధాకరం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి విజయరాజు

ఏలూరు (టూటౌన్): మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కాన్వాయ్‌పై జనసేన మూకల వికృత చేష్టలు బాధాకరమని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వేస్లీతో కలిసి మాట్లాడుతూ జిల్లాలో క్రిస్టియన్ల సమస్యలపై వైఎస్సార్‌సీపీ కార్యాచరణ సిద్ధం చేసి భరోసా కల్పించనుందన్నారు. తణుకులో కారుమూరి కాన్వాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని అన్నారు.

ఏబీపై వైఎస్సార్‌సీపీ నేత ధ్వజం



కలగర వెంకటేశ్వరరావు

నూజివీడు: వైఎస్సార్‌సీపీ గూండాలు ఇక్కడ ఎవరూ లేరని, ఏమి అరాచకం చేశారో చెప్పాలని, ఇలాంటి తప్పుడు మాటలు మాట్లాడటం మీ స్థాయికి తగదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కలగర వెంకటేశ్వరరావు రిటైర్డ్ డీజీ ఏబీ వెంకటేశ్వరరావుపై మండిపడ్డారు. నూజివీడు మండలం ముక్కొల్లుపాడులో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2014–19 కాలంలో టీడీపీ ప్రభుత్వంలో ఏబీ వెంకటేశ్వరరావు తమ గ్రామాన్ని దత్తత తీసుకున్నారని, దీంతో గ్రామం బాగుపడుతుందనుకుంటే కేవలం రెండు సిమెంట్ రోడ్లు వేయించారని చెప్పారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిధులను మాత్రం ఆయన అనుచరులు అధికారులను బెదిరించి బిల్లులు చేయించుకుని మెక్కేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాన్ని బాగుచేయడానికి కృషి చేశామే గానీ ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ వాళ్లను గూండాలంటావా.. దమ్ముంటే పంచాయతీ ఎన్నికల్లో నిలబడు.. నీపై నేనే నిలబడతా.. గెలిచి చూపించు.. అని కలగర వెంకటేశ్వరరావు సవాల్ విసిరారు. గత ఏడాది కాలంగా గ్రామానికి వస్తే చాలు కేసులు కట్టమంటూ పోలీసు అధికారులపై ఒత్తిడి చేస్తున్నది ఎవరో ప్రజలకు తెలుసునన్నారు. రాష్ట్రస్థాయి అధికారిగా పనిచేసిన ఆయన ఇలా ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. 56 ఏళ్లుగా తాను రాజకీయాల్లో ఉన్నానని, అప్పటి నుంచి పంచాయతీని గెలిపించుకుంటూనే ఉన్నానని, ఏనాడూ తాను ఎవరిపైనా దౌర్జన్యం చేయలేదని, గ్రామానికి వచ్చి విచారణ చేసుకోవాలని సూచించారు. గ్రామంలో ఒకరిద్దరు చెప్పే మాటలు నమ్మి తప్పుడు మాటలు మాట్లాడటం మంచిది కాదన్నారు. అయినా రాజకీయాల్లో ఎవరిష్టం వచ్చినట్టు వారు ఒకసారి కాకపోతే పదిసార్లు పార్టీలు మారతారని, దీనికి మీకొచ్చే నష్టమేమిటని కలగర ప్రశ్నించారు.

శ్రావణం.. శుభప్రదం

- పండుగలు, ప్రత్యేక దినాలకు నెలవు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు




ఏలూరు(ఆర్ఆర్‌పేట)/బుట్టాయగూడెం/ ద్వారకాతిరుమల: హిందువులకు అత్యంత శుభప్రదమైన మాసం శ్రావణం. ప్రత్యేక వ్రతాలు, నోములతో పాటు ఆలయాల్లో విశేష పూజలు చేస్తారు. ఆషాఢం తర్వాత శుభ ముహూర్తాలు మొదలుకానుండటంతో అంతటా శుభకార్యాల సందడి కనిపిస్తుంది. ప్రత్యేకంగా శుక్రవారాల్లో లక్ష్మీదేవికి వ్రతాలు, మంగళవారాల్లో మంగళ గౌరీ వ్రతాలు ఆచరిస్తారు. ఈ మాసంలో ప్రతిరోజూ ఒక్కో దేవతామూర్తికి విశేషమైనదిగా స్కాంద పురాణంలో చెప్పినట్టు పండితులు తెలుపుతున్నారు. శుక్రవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుంది.

పర్వదినాలు.. ప్రత్యేక పూజలు
- **ఆగస్టు 8న వరలక్ష్మి వ్రతం..** శ్రావణ మాసంలో రెండో శుక్రవారం మహిళలు వరలక్ష్మి వ్రతాలు ఆచరిస్తారు.
- **9న రాఖీ పౌర్ణమి..** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా శ్రావణ పౌర్ణమిని రాఖీ పౌర్ణమిగా జరుపుకుంటారు. దీనినే జంధ్యాల పౌర్ణమి అని పిలుస్తారు.
- **12న సంకష్ట హర చతుర్థి వ్రతం:** శ్రావణ బహుళ చవితి నాడు ప్రధాన సంకష్ట హర చతుర్థి వ్రతాలు జరుపుకుంటారు. గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు.
- **16న శ్రీకృష్ణ జన్మాష్టమి..** శ్రావణ బహుళ అష్టమి నాడు శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని జరుపుకుంటారు.
- **23న పోలాల అమావాస్య:** ఈ రోజుతో శ్రావణ మాసం ముగియనుంది. ఈ సందర్భంగా పోలాల అమావాస్య జరుపుకుంటారు.

వ్యాపారుల్లో నూతనోత్సాహం

శ్రావణ మాసం అంటే వ్యాపారుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తుంది. వస్త్ర, స్వర్ణ, పూజా సామగ్రి, పూలు, పండ్లు, నిత్యావసర వస్తువుల వ్యాపారాలు జోరందుకుంటాయి. వస్త్ర, బంగారు ఆభరణాల వ్యాపారులు ఆఫర్లతో మహిళలను ఆకర్షిస్తుంటారు.

విశిష్ట మాసం



శ్రావణ మాసానికి ఎంతో విశిష్టత ఉందని పురాణేతిహాసాలు చెబుతున్నాయి. ఈ నెలలో ఆలయాల్లోని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు ఆచరించడం అత్యంత పుణ్యప్రదం. తమ కుటుంబాలు పదికాలాల పాటు చల్లగా ఉండాలని మహిళలు వరలక్ష్మీ వ్రతాలు, మంగళగౌరీ వ్రతాలు ఆచరిస్తుంటారు. గృహప్రవేశాలకు, శంకుస్థాపనలకు, చాతుర్మాస్య దీక్షలకు ఈ మాసం విశిష్టమైంది.

– గుడిమెట్ల బాలకృష్ణ కిషోర్ శర్మ అవధాని, జ్యోతిష పండితుడు

డీసెట్ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీసెట్ ప్రవేశాలకు మొదటి విడత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఈనెల 17 నుంచి గురువారం వరకూ నిర్వహించినట్టు డైట్ కళాశాల దూబచర్ల ప్రిన్సిపాల్ ఎం.కమల ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) దూబచర్లకు మొత్తం 99 సీట్లు కేటాయించగా 56 మంది సర్టిఫికెట్లను పరిశీలించి ప్రవేశ పత్రాలు అందించామన్నారు. సీనియర్ అధ్యాపకులు ఎస్.రామసుబ్రహ్మణ్యం, కేఎస్‌బీకే రాజ్‌కుమార్, కె.సరోజిని, ఏఎస్ఎస్ఆర్ గుప్తా పాల్గొన్నారని తెలిపారు.

అనుమతి లేని వైద్యం.. ప్రాణాలతో చెలగాటం

- వచ్చీరాని వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలు
- నిబంధనలు మీరి క్లినిక్‌ల నిర్వహణ
- ధనార్జనే ధ్యేయంగా విధులు
- గ్రామాల్లో ఇష్టారాజ్యంగా వైద్యసేవలు



కామవరపుకోట: రోగులకు ప్రథమ చికిత్స చేయాల్సిన రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఆర్ఎంపీ) వచ్చీరాని వైద్యం చేస్తూ రోగి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. జిల్లాలో కొందరు ఆర్ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తుండగా, మరి కొందరు అనుమతులు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తూ రోగులను అడ్డంగా దోచుకుంటున్నారు. జిల్లాలో సుమారు 4 వేల మందికి పైగా ఆర్ఎంపీలు గ్రామాల్లో డాక్టర్లుగా చలామణి అవుతున్నారు. క్లినిక్ బోర్డులు పెట్టి విచ్చలవిడిగా వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేదలు పెద్దాస్పత్రులకు వెళ్లలేని పరిస్థితుల్లో వీరి వద్దే వైద్యం చేయించుకుంటున్నారు. ఇదే అదునుగా ఆర్ఎంపీలు డబ్బులకు కక్కుర్తి పడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

ఆర్ఎంపీలు చేయాల్సినవి..

చిన్న గాయమైతే కట్టు కట్టడం, జ్వరం వస్తే పారాసిటమాల్ వంటి మందులు ఇవ్వడం వరకే ఆర్ఎంపీలు పరిమితం కావాలి. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. రోగి సమస్య పెద్దదైతే అందుబాటులో ఉన్న పెద్ద ఆస్పత్రికి రిఫర్ చేయాలి.

ఆర్ఎంపీలు చేస్తున్నవి..

ఆర్ఎంపీలు నిబంధనలు మీరి ఎంబీబీఎస్ డాక్టర్ మాదిరిగా ప్రిస్కిప్షన్ ప్యాడ్ ముందు పెట్టుకుని, స్టెతస్కోప్ మెడలో వేసుకుని రోగుల్ని పరీక్షిస్తూ మందులు, ల్యాబ్ టెస్ట్, స్కానింగ్‌లు రాస్తున్నారు. ఒక్కోసారి సర్జరీలు చేసి రోగులకు ప్రాణాలు మీదకు తెచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. అంతటితో ఆగకుండా క్లినిక్‌లు ఏర్పాటుచేసి బెడ్స్ వేసి రోగులకు ఫ్లూయిడ్స్ ఎక్కించడం, ఎక్కువ మోతాదులో యాంటీ బయోటిక్ ఇంజక్షన్లు ఇవ్వడం వంటివి చేస్తున్నారు. అప్పటికీ రోగం తగ్గకపోతే సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స, టెస్టులు, రూమ్ అద్దెలు, మందులు వాటిలో కమీషన్లు దండుకుంటున్నారు. అలాగే వారి క్లినిక్‌లలో బిల్లులు లేని నాసిరకం మందులతో దర్జాగా వైద్యం చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని..
- కామవరపుకోట మండలంలోని కళ్లచెరువులో ఓ ఆర్ఎంపీ వచ్చీరాని వైద్యం చేసి రోగి ప్రాణం మీదకు తెచ్చాడు. ఇదే ఆర్ఎంపీ రెండేళ్ల క్రితం సాగిపాడులో ఓ వ్యక్తికి వైద్యం చేయగా అతడు ప్రాణాలు పోయినట్టు స్థానికులు చెబుతున్నారు.
- కామవరపుకోట మండల కేంద్రంలో ఆర్ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేసి ప్రాణాలు తీయగా మృతుడి కుటుంబంతో రాజీ కుదుర్చుకున్న సందర్భాలు ఉన్నాయి.
- కామవరపుకోట మండలంలోని వీరిశెట్టిగూడెంలో ఓ యువకుడు న్యుమోనియాతో బాధపడుతూ తడికలపూడిలో ఓ ఆర్ఎంపీ వద్దకు వెళ్లగా వైద్యం వికటించింది. యువకుడిని ఏలూరు ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు.
- అలాగే కొందరు ఆర్ఎంపీలు సొంతంగా మందులు షాపులు నిర్వహిస్తూ, అక్కడే వైద్యం చేస్తు డబ్బులు దండుకుంటున్నారు.

అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాస్థాయిలో, ప్రతి మండలంలో జిల్లా వైద్య శాఖ అధికారుల ద్వారా ఆర్ఎంపీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కొందరు ఆర్ఎంపీలు అవగాహన లేమితో వైద్యం చేస్తున్నారు. దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకుని ఆర్ఎంపీలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

– డాక్టర్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు, కామవరపుకోట

నిబంధనలు మీరితే చర్యలు

చిన్న గాయాలకు కట్లు కట్టడం, జ్వరం ఇతర కారణాలతో వచ్చిన వారికి టాబ్లెట్స్ ఇవ్వటం వరకే ఆర్ఎంపీలకు అర్హత. అంతకుమించి ఇంజక్షన్ ఇవ్వడం, ఫ్లూయిడ్స్ ఎక్కించడానికి అర్హత లేదు. అర్హతకు మించి ఆర్ఎంపీలు ఎవరైనా చికిత్సలు చేస్తే చట్టారీత్యా చర్యలు తీసుకుంటాం.

– పీజే అమృత, డీఎంహెచ్ఓ, ఏలూరు

క్లుప్తంగా

రేపు పారిజాతగిరిలో గిరిప్రదక్షిణ రోడ్డు ప్రారంభం



పారిజాతగిరి గిరిప్రదక్షిణ రోడ్డు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో పారిజాత గిరి కొండ చుట్టూ పార్లమెంట్ మాజీ సభ్యుడు, లైలా గ్రూప్ చైర్మన్ గోకరాజు గంగరాజు సౌజన్యంతో నిర్మించిన సిమెంటు రహదారిని శనివారం ప్రారంభిస్తున్నట్లు ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10:30కు అహోబిల త్రిదండి రామానుజ జీయర్ స్వామి ఈ రోడ్డును ప్రారంభిస్తారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులతో కొండ చుట్టూ తిరు వీధి ఉత్సవం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చిటికెన వేలు గోరుపై కాటన్ ప్రతిమ



ఏలూరు (టూటౌన్): చిటికెన వేలు గోరుపై సర్ ఆర్థర్ కాటన్ దొర ప్రతిమను చాక్‌పీస్‌తో చెక్కి మైక్రో ఆర్టిస్ట్ మేతర సురేష్ బాబు తనదైన శైలిలో గురువారం కాటన్ 126వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ కాటన్ దొర అని గోదావరి ప్రజలు అభిమానంగా పిలుచుకునే జనరల్ సర్ ఆర్థర్ కాటన్ అని ఆయనే సేవలను గుర్తు చేసుకున్నారు. ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించి ఎన్నో లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందేలా చేసి చిరస్మరణీయుడని కొనియాడారు.

రైళ్లలో ప్రత్యేక తనిఖీలు



బొకారో రైలులో ప్రయాణిస్తున్న క్రాఫ్ట్ టీమ్ సభ్యులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు రైల్వే స్టేషన్లో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ (క్రాఫ్ట్) ఆధ్వర్యంలో ఈ నెల 30 వరకు రైల్వేస్టేషన్లో ప్రత్యేక తనిఖీలను నిర్వహిస్తామని జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్ కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా గురువారం బొకారో ఎక్స్‌ప్రెస్ రైలులో తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు రైల్వే స్టేషన్ వరకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించామని వివరించారు. ప్రయాణికులకు ప్రపంచ మానవ అక్రమ రవాణా గురించి అవగాహనను కల్పించామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాసరావు, సీఎస్‌డబ్ల్యూ జి.రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మియావాకి విధానంలో చిట్టడవుల పెంపకం

- ద్వారకాతిరుమల శ్రీవారి కొండపై వినూత్న ప్రయోగం
- 30 శాతం ఆక్సిజన్ పెరుగుతుందంటున్న నిపుణులు



ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం



టోల్‌గేట్ ప్రాంతంలోని ఖాళీ స్థలంలో మియావాకి పద్ధతిలో దగ్గర దగ్గరగా మొక్కలు నాటుతున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రస్తుత రోజుల్లో నానాటికీ వాతావరణ కాలుష్యం పెరిగిపోతోంది. ఆ కాలుష్యాన్ని తగ్గించాలంటే మొక్కల పెంపకం ఒక్కటే మార్గం. మొక్కల పెంపకంపై ప్రభుత్వాలు ఎన్ని ప్రచారాలు చేస్తున్నా అడవుల శాతం మాత్రం పెరగడం లేదు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే భవిష్యత్‌లో ఆక్సిజన్ శాతం భారీగా తగ్గుతుందని స్పష్టమవుతోంది. ఈ తరుణంలో జపాన్ వృక్ష శాస్త్రవేత్త అకీరా మియావాకి అనుసరించిన మియావాకి (చిట్టి అడవులు) పద్ధతిలో జనాభా ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మొక్కలు పెంపకం చేపట్టాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సూచిస్తోంది. ఈ నేపథ్యంలో ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో 10 వేల మొక్కలను ఈ మియావాకి పద్ధతిలో నాటుతున్నారు.

లక్ష్యంతో ముందుకు..

విశాఖపట్టణానికి చెందిన మైత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మైనింగ్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ శ్రీనివాసరావు ఇటీవల 5 వేల నేరేడు, మామిడి, వేప, రావి, మద్ది, కొండ తంగేడి తదితర జాతుల మొక్కలను అందించారు. వీటిని శ్రీవారి కొండపైన టోల్‌గేట్ పక్కనున్న రెండు ఎకరాల ఖాళీ స్థలంలో మియావాకి పద్ధతిలో నాటుతున్నారు. అలాగే పూళ్లకు చెందిన దాత పీవీ రామాంజనేయులు సహకారంతో శివాలయం కొండ దిగువన రెండు ఎకరాల ఖాళీ స్థలంలో ఫ్రూట్ బియరింగ్, శివుడికి ప్రీతికరమైన మారేడు, నాగమల్లి మొక్కలను నాటుతున్నారు. అదేవిధంగా లక్ష్మీపురం ఆర్చిగేటు వద్ద నుంచి గరుడాళ్వార్ విగ్రహం వరకు ఉన్న రోడ్డు మధ్యలోని డివైడర్‌లో పాక్ షైల్ మొక్కలు, కొత్త బస్టాండ్ వద్ద నుంచి పాత సినిమాహాలు వరకు డివైడర్‌లో టెర్మిలియన్ మెంటీలియన్ మొక్కలు నాటుతున్నారు.

సోము మొక్కలు ప్రత్యేకం

కొండపై నాటుతున్న మొక్కల్లో సోము జాతి మొక్కలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. ఆలయాల్లో ధ్వజ స్తంభాలకు ఈ చెట్లను వినియోగిస్తారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆలయ అధికారులు 100 మొక్కలను నాటించారు. ప్రస్తుతం ఈ పనులు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈఈ డీవీ భాస్కర్, ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణ పర్యవేక్షణలో శరవేగంగా జరుగుతున్నాయి.

మియావాకి పద్ధతిలో మొక్కలు నాటే విధానం

- మొక్కలు నాటాలనుకునే భూమిని ఎక్కువ లోతు తవ్వాలి.
- మొక్కల ఎదుగుదలకు అవసరమైన నాణ్యమైన కంపోస్ట్ ఎరువును సారవంతమైన మట్టితో కలిపి గొయ్యిని పూడ్చాలి.
- స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వృక్ష జాతులను ఎంపిక చేయాలి.
- ఎక్కువ రకాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- మొక్కకు, మొక్కకు ధ్య దూరం లేకుండా దట్టంగా మొక్కలు నాటాలి.
- పక్కనున్న మొక్కల ఎదుగుదలపై ప్రభావం పడకుండా చిన్న, పెద్ద, మధ్యస్త (ఎత్తు) మొక్కలు ఒకే దగ్గర ఉండేలా రకరకాల వృక్ష జాతులను ఎంపిక చేయాలి.
- ప్రతిరోజూ క్రమం తప్పకుండా డ్రిప్ వంటి పైప్‌ల ద్వారా నీటిని అందించాలి.



నాటేందుకు మొక్కలు తీసుకెళ్తున్న సిబ్బంది

మియావాకి పద్ధతితో ప్రయోజనాలివే.

- ఒక్కో ఎకరానికి 4 వేలకు పైగా మొక్కలు నాటవచ్చు.
- చిట్టడవులను తలపించేలా దట్టంగా పెరుగుతాయి.
- జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్వచ్ఛమైన గాలి లభిస్తుంది.
- ఈ విధానంతో 30 శాతం ఆక్సిజన్ అందుతుంది.
- 30 రెట్లు త్వరగా మొక్కలు వృద్ధి చెందుతాయి.
- మూడు నుంచి నాలుగేళ్లలోనే 10 రెట్లు పచ్చదనం ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది.
- నిర్వహణా వ్యయం చాలా తక్కువ. అలాగే పక్షులు గూళ్లు పెట్టుకోవడానికి వీలుంటుంది

మియావాకి విధానమే మేలు



మియావాకి విధానంలో మొక్కలు నాటడమే మేలు. పచ్చని ఆహ్లాదకర వాతావరణంతో పాటు స్వచ్ఛమైన గాలి, ఆక్సిజన్‌ను అందిస్తాయి. క్షేత్రంలో నానాటికి భక్తుల రద్దీ పెరుగుతోంది. ఇలాంటి సమయంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం శుభపరిణామం. భవిష్యత్ తరాలకు ఈ చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ నెలాఖరు నాటికి 10 వేల మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

– ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి, ఈఓ, ద్వారకాతిరుమల దేవస్థానం

గుర్రపు డెక్కతో ముంపు ముప్పు

- పెదఎడ్లగాడి వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క
- ఆందోళన చెందుతున్న కొల్లేరు ప్రాంతవాసులు



ఉప్పుటేరుపై కొత్త, పాత రైల్వే బ్రిడ్జిల వద్ద మేటలు వేసిన గుర్రపుడెక్క

కైకలూరు: కొల్లేరు ప్రాంతానికి ప్రతిఏటా గుర్రపుడెక్క పెద్ద గుదిబండగా మారుతోంది. కొల్లేరుకు చేరే వరద నీటిని సముద్రానికి పంపే పెదఎడ్లగాడి వంతెన వద్ద గుర్రపుడెక్క పేరుకుపోవడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతోన్నారు. మొత్తం 56 ఖానాలకు గానూ సగం ఖానాలపైనే గుర్రపుడెక్క ఆక్రమించింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 12 మండలాలు పరిధిలో 2,22,300 ఎకరాలు విస్తీర్ణంలో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో మొత్తం 122 గ్రామాలు ఉన్నాయి. డెక్క కారణంగా ప్రతి ఏడాదీ నీటి ప్రవాహం వెనక్కి మళ్లి కొల్లేరు గ్రామాలు ముంపులో చిక్కుకుంటున్నాయి.

67 డ్రెయిన్ల ద్వారా నీరు

వరదల సమయంలో ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి 67 డ్రెయిన్ల ద్వారా 1.10 లక్షల క్యూసెక్కుల నీరు కొల్లేరుకు చేరుతుంది. నీరంతా కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలం పెదఎడ్లగాడి, చిన్న ఎడ్లగాడి, పోలరాజ్ కాలువల ద్వారా ఉప్పుటేరు మీదుగా సముద్రంలో కలుస్తుంది. వాస్తవానికి కొల్లేరుకు చేరుతున్న 1.10 క్యూసెక్కుల నీటిలో 12 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే దిగువకు వస్తుంది. పెదఎడ్లగాడి నుంచి ఉప్పుటేరు వరకు ఛానలైజేషన్ చేయాలని 1895లో ఇరిగేషన్ ఎస్‌ఈ హుస్సేన్, 1964లో మిత్ర కమిటీ, 1986లో శ్రీరామకృష్ణయ్య కమిటీలు సూచనలు చేశాయి. అయితే ఇవేమి అమలు కాలేదు. దీనికి తోడు ప్రవాహానికి గుర్రపుడెక్క అడ్డు రావడంతో నీరు వెనక్కి మళ్లి లంక గ్రామాలు మునుగుతున్నాయి.

కొత్త రైల్వే బ్రిడ్జితో చిక్కులు

పెదఎడ్లగాడి వంతెన నుంచి వచ్చే వరద నీరు ఆలపాడు–ఆకివీడు గ్రామాల మధ్య ఉప్పుటేరు నుంచి సముద్రంలోకి చేరాలి. ఉప్పుటేరుపై పాత బ్రిడ్జీ ఉంది. కొన్ని సంవత్సరాల క్రితం డబుల్ లైన్ నిమిత్తం మరో కొత్త బ్రిడ్జిని నిర్మించారు. వాస్తవానికి పాత బ్రిడ్జి ఖానా నుంచి ఖానా మధ్య 30 గజాల దూరం ఉంది. అదే కొత్త బ్రిడ్జి ఖానా నుంచి ఖాన మధ్య కేవలం 10 గజాల దూరం మాత్రమే ఉండడంతో గుర్రపు డెక్క మేటలు వేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి గుర్రపు డెక్క సమస్యకు పరిష్కారం చూపాలని కొల్లేరు ప్రాంతవాసులు కోరుతున్నారు.

రూ.20 లక్షలతో ప్రతిపాదనలు



పెదఎడ్లగాడి వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించడానికి రూ.20 లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఈ మేరకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. కొల్లేరుకు చేరే నీటిని కిందకు పంపడానికి పెదఎడ్లగాడి వంతెన ఎంతో కీలకం. ఎగువ నుంచి వచ్చిన డెక్క ఖానాల మధ్య అడ్డుగా ఉంది. ఎప్పటికప్పుడు నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తున్నాం.

– ఎం.రామకృష్ణ, డ్రెయినేజీ డీఈఈ, కైకలూరు

రహదారులు ఇలా.. ప్రయాణం ఎలా?



కొమ్మాయిచెరువు ప్రాంతంలోని రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

సంక్రాంతి పండుగలోపే రోడ్లు అభివృద్ధి చేసేస్తామన్న కూటమి నేతల వాగ్దానాలు మాటలకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిందని, సంక్రాంతి పండుగ వెళ్లిపోయి ఆరు నెలలైనా రహదారులు అభివృద్ధి చేయలేకపోతున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తణుకు పట్టణంలోని రోడ్లు ఛిద్రమైపోయి ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మునిసిపల్ కార్యాలయం వీధి పూర్తిగా ధ్వంసమైపోయిందని, రైల్వేస్టేషన్ నుంచి ఆర్వోబీ వరకు రోడ్డు ఛిద్రమైపోగా, సజ్జాపురం, హౌసింగ్‌బోర్డు కాలనీ, పాతవూరు, ఉండ్రాజవరం రోడ్డు వంటి ప్రధాన రహదారులు ధ్వంసమైపోయి ప్రమాదకరంగా ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

– తణుకు అర్బన్



తణుకు సజ్జాపురం సర్వీసు రోడ్డులో గోతులమయమైన ప్రాంతం



మునిసిపల్ కార్యాలయం రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గోతులు



తణుకు రైల్వేస్టేషన్ రోడ్డు దుస్థితి ఇలా

బహుళ పంటలతో అధిక లాభాలు



అంతర పంటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు

కామవరపుకోట: కొబ్బరి, ఆయిల్‌పామ్ వంటి పంటలో బహుళ పంటలు సాగు చేయటం వల్ల రైతులు అధిక లాభాలు పొందవచ్చునని ఉద్యానవనశాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. మండలంలో తడికలపూడి రత్నగిరినగర్, కళ్లచెరువు గ్రామాల్లో ఆయన పర్యటించి అంతర పంటలను పరిశీలించారు తడికలపూడి గ్రామాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్ పంటలు మల్టీ క్రాఫింగ్ బహుళ పంట సాగు చేస్తున్న రైతుల తోటల్లోని కలెక్షన్ సెంటర్ సోలార్ కోల్డ్ రూమ్ డ్రైవర్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు బహుళ పంట సాగు పద్ధతిని అవలంబించాలని అవలంభించడం వల్ల ఆదాయం పెరుగుతుందని తెలిపారు. రత్నగిరినగర్‌లో కొబ్బరి పంటలో కోకో, మిరియాలు సాగుతో పాటు వివిధ రకాల కొత్త సుగంధ ద్రవ్యాలు పంటలు కూడా పండించే విధానాలను రైతులందరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. ఎంత పెట్టుబడి పెడితే ఎంత లాభం వస్తుంది? ఏ పంట వేస్తే ఎకరానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం ఎలా పొందవచ్చు? అనే విషయాలు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట మండల ఉద్యానవన శాఖ అధికారి రత్నమాల ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

చింతలపూడి: మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన భూక్యా బాలు(44) విద్యుత్ షాక్‌తో గురువారం మృతి చెందాడు. మేకలను తోలుకుని పొలానికి వెళ్లిన బాలు తెగిపడిన విద్యుత్ సర్వీసు వైరు కాలికి తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చింతలపూడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.



బ్యాంకు ఉద్యోగి ఇంట్లో చోరీ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శేషాద్రినగర్‌లో ఓ బ్యాంకు ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఇండియన్ ఓవర్సీస్‌బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న కె.శ్రీకాంత్ శేషాద్రినగర్‌లోని అల్లూరి సీతారామరాజు పార్కు సమీపంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 20న ఆసుపత్రి పనిపై కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లి, గురువారం తిరిగి వచ్చారు. అయితే ఇంటి గేటు తీసుకుని లోపలికి వెళ్లే సరికి ఇంటి మెయిన్ డోర్ పగులగొట్టి రెండు బెడ్‌రూమ్‌లలోని బీరువాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా లాకర్‌లో ఉంచిన నగదు, వెండి వస్తువులు, చిన్న పిల్లల వెండి వస్తువులు, బ్యాంక్ ల్యాప్‌టాప్ చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు శ్రీకాంత్ గురువారం పోలీసులను ఆశ్రయించాడు.

కాలువలో స్నానానికి వెళ్లి వృద్ధుడి గల్లంతు

ముదినేపల్లి రూరల్: బంధువు దహనసంస్కారాల అనంతరం కాలువలో స్నానానికి వెళ్లిన వృద్ధుడు గల్లంతైన ఘటన మండలంలోని కాకరవాడలో గురువారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం కాకరవాడకు చెందిన మరీదు వెంకటేశ్వరరావు(69) బంధువు చనిపోవడంతో దహన సంస్కారాల్లో పాల్గొన్నాడు. అనంతరం వెంకటేశ్వరరావు స్థానిక క్యాంప్‌బెల్ కాలువలో స్నానానికి వెళ్లాడు. కాలువలో నీటి ఉధృతి ఎక్కువగా ఉండడాన్ని గమనించకపోవడంతో కాలువలోకి దిగిన వెంటనే కొట్టుకుపోయాడు. బంధువులు ఎంత గాలించినప్పటికీ వెంకటేశ్వరరావు ఆచూకీ దొరకలేదు. దీంతో వెంకటేశ్వరరావు కుమార్తె మురాల కనకదుర్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు హెచ్‌సీ పి.పెద్దిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీపై నుంచి పడి వ్యక్తి మృతి

దెందులూరు: లారీపై నుంచి పడి వ్యక్తి మృతి చెందాడని దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపారు. గురువారం దెందులూరు మండలంలో ముప్పవరం సమీపంలో ఘటన చోటు చేసుకుందని వివరించారు. గుండుగొలనుకు చెందిన కరణం నాగరాజు (43) కూలీ పనుల నిమిత్తం లారీపై ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తూ లారీపై నుండి కిందపడ్డాడని పేర్కొన్నారు. దీంతో నాగరాజు సంఘటన స్థలంలోనే మృతి చెందాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్పష్టం చేశారు.

అభినయ సరస్వతి పుస్తకావిష్కరణ



బెంగుళూరులో పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: ఇటీవల దివంగతురాలైన మహానటి బి.సరోజా దేవిపై ఆచంటకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు వైట్ల కిషోర్ కుమార్ రచించిన అభినయ సరస్వతి పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. బెంగుళూరులోని మల్లేశ్వరంలో సరోజాదేవి స్వగృహంలో సరోజా దేవి కుమార్తె ఇందిరా పరమేశ్వరి చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు కిషోర్ తెలిపారు. అమ్మపై అభిమానంతో సినీ జీవిత విశేషాలతో మంచి పుస్తకం రచించడం ఆనందకరమని రచయిత కిషోర్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో విజయకుమార్‌రెడ్డి, జె.సూర్యకిరణ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

కృష్ణలంక (విజయవాడతూర్పు): ఇంటి నుంచి బయటకు వచ్చి విజయవాడ బస్టాండ్‌కు చేరుకున్న బాలికకి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. కృష్ణలంక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొయ్యలగూడేనికి చెందిన 16 ఏళ్ల బాలిక కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు బుధవారం అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులకు సమాచారం రావడంతో బస్టాండ్‌లో గాలింపు చేపట్టి, ఆ బాలిక మరో యువకుడితో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు గురువారం విజయవాడ చేరుకున్న తల్లిదండ్రులకు బాలికని, ఏలూరు జిల్లా నుంచి వచ్చిన పోలీసులకు యువకుడిని అప్పగించారు.



క్లుప్తంగా

నేడు సుధ ఫెర్టిలిటీ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం

తణుకు అర్బన్: ఐవీఎఫ్ డే సందర్భంగా తణుకు సుధ ఫెర్టిలిటీ సెంటర్‌లో ఈనెల 25వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం తెలిపారు. తణుకు సొసైటీ రోడ్డులోని సుధ ఫెర్టిలిటీ (ఐవీఎఫ్) సెంటర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరంలో ఉచిత వైద్యం పొందవచ్చని వివరించారు. వివాహమై ఏడాదిలోపు సంతానం కలగని దంపతులు, నెలసరులు సరిగా రానివారు, గతంలో గర్భస్రావం జరిగి మళ్లీ గర్భధారణ కోసం వేచిచూస్తున్నవారు, 40 సంవత్సరాలు పైబడిన స్త్రీలు సంతానం కోసం, గర్భాశయ సంబంధిత అన్ని రకాల వ్యాధులకు సంప్రదించవచ్చని సూచించారు. పాత రిపోర్టులతో పాటు ఫోన్ ద్వారా డాక్టర్ అపాయింట్‌మెంట్ తీసుకుని రావాలని డాక్టర్ కె.ప్రశాంతి వైద్యసేవలందిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 94920 99724 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ ఈఈ కే.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో నీలాద్రిపురం, కొమ్ముగూడెం, కృష్ణాపురం, పుల్లాయగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తణుకు ఆర్టీసీలో డ్రైవర్స్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

తణుకు అర్బన్: తణుకు ఆర్టీసీ డిపోలో రోజువారి వేతనంతో అవుట్ సోర్సింగ్ విధానంలో డ్రైవర్స్‌గా పనిచేయుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. హెవీ లైసెన్స్ తీసుకుని 18 నెలలు పూర్తి అయి ఉండాలని, డ్రైవర్స్ బయోడేటా పరిశీలించి ఎటువంటి యాక్సిడెంట్‌లు లేనట్లుగా మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ ఇచ్చే ధ్రువపత్రం, ఆధార్ కార్డు, హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో డిపో మేనేజర్ కార్యాలయానికి రావాలని, రికార్డు పరిశీలన అనంతరం మెడికల్ పరీక్షలు, శిక్షణ అనంతరం సెలెక్ట్ అయినవారిని రోజువారి వేతనానికి తీసుకుంటామని వివరించారు. మీ దరఖాస్తులను తణుకు డిపో అసిస్టెంట్ మేనేజర్ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ 7382908959 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): భీమవరంకు చెందిన కాసారపు ప్రసాద్ కుమారుడు విహాంత్ అర్జున్ (బాలుడు) విజయవాడ రెయిన్‌బొ చిల్డ్రన్స్ ఆసుపత్రిలో బ్లడ్ కాన్సర్‌తో పోరాడుతున్నాడు. ఈ నేపథ్యంలో బాలుడి చికిత్స కోసం స్థానిక తాడేపల్లిగూడెం శ్రీ వాసవి జీఎంఆర్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు సేకరించిన ఆర్థిక సాయంతో బాధితుని తరుపున వ్యక్తి ఆర్‌కేకు గురువారం రూ.11,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పీఓ సునీల్ కుమార్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మలేషియా నుంచి ఇండియాకు రప్పించండి


గట్టిం మాణిక్యాలరావుకు వినతిపత్రం అందజేస్తున్న కుటుంబ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు గ్రామానికి చెందిన జి.వీరబాబు మూడు సంవత్సరాలు క్రితం మలేషియా దేశంలో పామాయిల్ తోటలో ఉద్యోగం చేయు నిమిత్తం వెళ్లగా అక్కడ నుంచి నేటికి ఎటువంటి సమాచారం లేదని, ఇండియాకు రప్పించాలని తండ్రి శ్రీనివాస్, కుటుంబ సభ్యులు గురువారం పట్టణంలో కై ండ్‌నెస్ సొసైటీ గట్టిం మాణిక్యాలరావుకు వినతిపత్రం అందజేశారు.

ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోండి

భీమవరం అర్బన్: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాడేరు సొసైటీ సీఈవో నందమూరి సుబ్బారావు రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని తాడేరులో సహకార పరపతి సంఘంలో బుధవారం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నందమూరి సుబ్బారావు మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఏఐసీ) కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నారన్నారు. ఆగస్టు 15లోపు పంటల బీమా పథకానికి ప్రీమియం ఎకరానికి రూ. 210 చెల్లించాలన్నారు. ఇలా చేయడం ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టపోయినప్పుడు నష్ట పరిహారం చెల్లిస్తారన్నారు. కౌలు రైతులు, రుణాలు తీసుకోని రైతులకి కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీ ఫీల్డ్ కో ఆర్డినేటర్ హశ్వంత్, తాడేరు, బేతపూడి రైతులు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకప్రాయం

- సెలయేటిని తలపిస్తున్న రహదారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు


ఎల్.అగ్రహారం - చినతాడేపల్లి రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పలు ప్రధాన రహదారులు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిన్నపాటి సెలయేటిని తలపిస్తున్నాయి. ప్రధానంగా ఎల్.అగ్రహారం – చినతాడేపల్లి, జాతీయ రహదారి నెం.16 నుంచి కొండ్రుప్రోలు గ్రామంలోకి, నిట్ కళాశాల నుంచి అప్పారావుపేట వరకు, కడియద్ద – వెంకట్రామన్నగూడెం, జగన్నాథపురం – దండగర్ర తదితర రహదారులపై గోతుల్లో వర్షపు నీరు చేరింది. దీంతో రహదారులా...? గుంతలో ? అర్థం కాని పరిస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో ఏది రహదారో...? ఏది గుంతో తెలియడం లేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. రహదారిపై పడిన వర్షపు నీరు దిగువకు పోయే మార్గాలు లేకపోవడంతో రోడ్డుపైనే నిల్వ ఉండి గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో రహదారులు నిర్మించిన కొద్ది కాలానికే పాడైపోతున్నాయి. రహదారిపై నిలిచిన నీరు బయటకు పోయే మార్గాలను ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. లేకుంటే ఈ రహదారులపై పడిన గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.


తాడేపల్లిగూడెం శివారు నిట్ సమీపంలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు


కేఎస్ఎన్ కాలనీ నుంచి కొండ్రుప్రోలు గ్రామంలోకి వెళ్లే రహదారి దుస్థితి

కూటమిది నయవంచక పాలన


తణుకులో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

- అబద్ధం, వంచన, మోసం కూటమి నైజంగా మారాయి
- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి నయవంచన పాలన సాగిస్తోందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకు 20, 25 వార్డుల్లో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజలకు తెలుపుదామని గడప గడపకూ వెళ్తుంటే ప్రజలు ఎదురొచ్చి మరీ చంద్రబాబు తమను మోసం చేశాడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా కరెంటు బిల్లులు పెంచేసి తల్లికి వందనం లబ్ధికి ఆటంకంగా చేశారని స్పష్టం చేశారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్న మాటలు ప్రజలు చీదరించుకుంటున్నారని దుయ్యబట్టారు. జగన్ ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం ఇంటి గుమ్మంలోకి వచ్చేవని, కానీ నేడు రేషన్ దుకాణాలకు వెళ్లి మూటలు మోసుకుంటూ ఇంటికి రావాల్సి వస్తుందని ఆరోపిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ బూటకాలు, అబద్ధాలేనని ఏ ఒక్క పథకం కూడా సంపూర్ణంగా ఇవ్వకుండా సూపర్‌సిక్స్ ఇచ్చేసినట్లేనని చంద్రబాబు అంటుండం మోసం, వంచనకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఇంటి గుమ్మంలోకి వెళ్లి చంద్రబాబు మోసాలను తెలిపే కరపత్రాలు కారుమూరి స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి, 25వ వార్డు నాయకులు పైడి సాయిసూర్య, నాసరి పార్థసారధి, కలవపూడి బాబు, షేక్ జిలాని, బోగా గోవిందరాజు, 20వ వార్డు నాయకులు జల్లూరి జగదీష్, మెహర్ అన్సారీ, దుర్గామహేష్, వీరమల్లు ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి


ఇంటింటికి ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలకు షాక్ కొట్టే స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పట్టణ ప్రజలకు సీపీఎం జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ విజ్ఞప్తి చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా తాడేపల్లిగూడెం సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. జువ్వలపాలెం, శివాలయం వీధుల్లో ప్రచార ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన విద్యుత్ సంస్కరణలలో భాగంగా కూటమి ప్రభుత్వం అదానీ స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆలోచన చేస్తోందని, సీపీఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 2 కోట్లు విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటి స్థానంలో అదానీ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించాలని కూటమి ప్రభుత్వం చూడటం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లల్లో రాత్రి 6 గంటల నుంచి 10 గంటల వరకు అధిక రేట్లు వసూలు చేస్తారని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లు బిగించిన తరువాత కరెంట్ బిల్లులు షాక్ కొట్టేలా ఉంటాయని చెప్పారు. స్మార్ట్ మీటర్‌కు సింగిల్ ఫేజ్‌కు రూ. 8,927, త్రీఫేజ్‌కు రూ 17,286 వసూలు చేస్తారని, మీటర్‌కు అయ్యేఖర్చు నెలవారీ పద్ధతిలో కష్టమర్లు వద్ద నుంచి వసూలు చేస్తారని పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 2 కోట్లు మీటర్లు బిగించడానికి అదానీ కంపెనీకి కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ ఇచ్చారని దీని వల్ల రాష్ట్ర ప్రజలపై 25వేల కోట్లు భారం పడుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు సరైన బుద్ధిచెప్పాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, శిద్దిరెడ్డి శేషు, పోతు శ్రీను, అన్నం చిన్నారావు, కన్నంరెడ్డి శివాజీ, సాయి, నాగేంద్రబాబు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం


నల్లిమిల్లి విజయానందరెడ్డి (అంజిరెడ్డి)

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారని రెడ్డి వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లిమిల్లి విజయానంద రెడ్డి (అంజిరెడ్డి) అన్నారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ రాజంపేట ఎంపీగా మిథున్ రెడ్డి మూడు పర్యాయాలు గెలిచారని, హ్యాట్రిక్ సాధించారని, నేడు ప్రభుత్వం మిథున్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి, అరెస్ట్ చేయడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా దెబ్బతీయడానికి ఇటువంటి పన్నాగాలు టీడీపీ పన్నుతుందని విమర్శించారు. అక్రమ మద్యం కేసులో ముద్దాయిగా చూపించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించి, చంద్రబాబు నాయుడుని ఉంచిన సెల్‌లోనే పెట్టడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. అంతేగాక రాష్ట్రంలో ఎటువంటి చార్జీలు పెంచమని మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేడు స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారం మోపుతుందని, రానున్న రోజుల్లో ప్రజలు కూటమి నాయకులకు తగిన బుద్ధి చెబుతారన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళులు

ఆకివీడు: కేరళ మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్య్ర సమరయోధుడు వీఎస్ అచ్యుతానందన్‌కు సీపీఎం కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. గురువారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఏరియా కార్యదర్శి తవిటి నాయుడు మాట్లాడుతూ చివరి శ్వాస వరకు పార్టీ అభివృద్ధి, ఆశయాలకు పనిచేశారన్నారు. ఎన్నో ప్రజా పోరాటాల్లో కీలక భూమిక పోషించిన అచ్యుతానందం మరణించడం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. అచ్యుతానందన్ ఆశయ సాధనకు నేటి కమ్యూనిస్టులంతా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాయమవుతున్న వృక్ష సంపద



తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు జాతీయ రహదారి సమీపంలో నరికేసిన మామిడి చెట్లు

- నరికి తరలిస్తున్న వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఏళ్ల నాటి వృక్ష సంపద మాయమవుతుంది. అభివృద్ధి పేరుతో చెట్లను నరికి ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. తాజాగా కొండ్రుప్రోలు జాతీయ రహదారి సమీపంలో పంచాయతీకి చెందిన భూమిలోని దశాబ్దాల చరిత్ర కలిగిన మామిడి, ఇతర జాతులకు చెందిన మొక్కలను నరికి సరిహద్దులు దాటించారని తెలిసింది. ప్రభుత్వ భూముల్లోని చెట్లను నరకడానికి తగిన అనుమతులు పొందాల్సి ఉంది. అయితే, ఎటువంటి అనుమతులు లేకుండానే చెట్లను నరికేస్తున్నట్లు తెలిసింది. సంబంధిత శాఖ అధికారులకు తెలిసే ఈ తంతు జరుగుతుందా ? అనే దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును ఫోన్‌లో ప్రశ్నించగా, సెలవులో ఉన్నట్లు తెలిపారు. ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్‌ను ప్రశ్నించగా, తన దృష్టికి రాలేదని తెలిపారు.

రోడ్లపైనే వాహనాలు.. తప్పని ట్రాఫిక్ చిక్కులు

- ట్రాఫిక్ వలయంలో తాడేపల్లిగూడెం పట్టణం
- రోజు, రోజుకూ జటిలమవుతున్న ట్రాఫిక్


పట్టణంలో ట్రాఫిక్, ప్రయాణిస్తున్న వివిధ వాహనాలు




తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణాన్ని పీడిస్తున్న సమస్యలలో అతి పెద్ద సమస్య ట్రాఫిక్ సమస్య ఒకటి. పట్టణంలో రోడ్డులు వెడల్పు, ఫోర్‌లైన్‌లతో డివైడర్లు ఏర్పాటు చేసినప్పటికి ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాలు నిబంధనలు పాటించకపోవడంతో తరుచు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రెండో ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఉన్నప్పటికి మొదటి ఫ్లై ఓవర్ (కె.ఎన్.రోడ్డు) రహదారిలో రద్దీ మరింత పెరిగింది.

పార్కింగ్ లేక అవస్థలు

గతంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు కె.ఎన్.రోడ్డులో పలువురు ఎమ్మెల్యేలు కృషి చేయడం, రోడ్డుకు ఇరువైపుల సెట్ బ్యాక్ అమలు చేయించారు. అనంతరం కాలంలో సెట్ బ్యాక్‌కు వదలిన స్థలాలను షాపుల యజమానులు, వాటిలో అద్దెకున్నవారు తిరిగి వాటిని వినియోగంలోకి తీసుకోవడంతో సమస్య మొదటికి వచ్చింది. దీనికి తోడు షాపుల వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డు మార్జిన్ వరకు వారి వారి వ్యాపారాలు కోసం ముందుకు వచ్చారు. చిరు వ్యాపారులు సైతం రోడ్డు మార్జినులోను, పలువురి షాపులకు ఎదురుగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. చిరు వ్యాపారులు, షాపుల వద్దకు వచ్చే వినియోగదారులు వాహనాలను రోడ్డుపైనే నిలిపి ఉంచుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతుంది. సెట్ బ్యాక్‌లు సైతం అమలు చేయాలని కోరుతున్నారు.

నిత్యం సమస్యలతో ఇబ్బందులు

పట్టణంలోని వన్‌టౌన్‌లో హౌసింగ్‌బోర్డు ఎస్వీఆర్ సెంటర్ జంక్షన్ నుంచి రంగా విగ్రహం సెంటర్, బస్సు కాంప్లెక్స్ ఇన్‌గేట్, అవుట్ గేట్ సెంటర్‌లు, జీవీ మాల్ జంక్షన్, తాలూకా ఆఫీస్ సెంటర్ జంక్షన్, ఎన్‌టీఆర్ జంక్షన్ వద్ద, టూ టౌన్‌లో సైతం పోలీస్ ఐలాండ్ వద్ద, ఇతర జంక్షన్‌లు తణుకువైపు, భీమవరం వైపు, ఏలూరు వైపు జంక్షన్‌లు వద్ద ప్రయాణీకులకు, పాదచారులకు తిప్పలు తప్పడం లేదు. స్పీడ్‌గా గమ్యస్థానాలకు చేరే క్రమంలో వారి ఇష్టం వచ్చిన రీతిలో వాహనాలను నడుపుతున్నారు. ముఖ్యంగా ఆటోలు నడిపేవారు రాంగ్ రూట్లల్లో వెళ్తూ ద్విచక్రవాహనదారులను, పాదచారులను అయోమయంలో పడివేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో ఆటోలు నడిపేవారికి, బైక్‌దారులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. కొట్టుకునే పరిస్థితులు వస్తున్నాయి. ఇది ఇలా ఉంటే బస్సు స్టాప్‌లకు చేరిన బస్సులకు అడ్డంగా ప్రయాణీకులను ఎక్కించుకునే క్రమంలో ఆటోలు పెట్టడం వల్ల జంక్షన్‌లు వద్ద ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతుంది.

స్కూల్, కళాశాల స్టూడెంట్స్‌కు ఇబ్బందులు

స్కూల్, కళాశాలలు వదిలే సాయంత్రం సమయాలలో వివిధ జంక్షన్‌లు ముఖ్యంగా ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ సెంటర్‌లు, తాలూకా ఆఫీస్ సెంటర్, ఎన్‌టీఆర్ సర్కిల్, తణుకు, ఏలూరు, భీమవరం రహదారి మార్గాల్లోని బస్సు స్టాప్‌ల వద్ద స్టూడెంట్స్ ఫీట్స్ చేయడంతో, ఆటోలు కారణంగాను రహదారులపై రద్దీ బాగా పెరుగుతుంది. ద్విచక్ర, ఫోర్ వీలర్స్ వాహనదారులు, పాదచారులు, స్టూడెంట్స్ పలు ఇక్కట్లు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యను అరికట్టాలను పలువురు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్‌పై సరైన చర్యలు తీసుకోవాలి



ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు పెరిగిపోతుంది. ద్విచక్రవాహనదారులు, ముఖ్యంగా ఆటోలు నడిపేవారు, ఇతర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించే విధంగా చూడాలి. ప్రధాన కూడలిలలో వాహనదారులు వారి ఇష్టం వచ్చిన రీతులతో వాహనాలను నడప కుండా సంబంధిత ట్రాఫిక్ పోలీసులు సరైన చర్యలు చేపట్టాలి. ట్రాఫిక్ సమస్య జటిలం కాకుండా చూడాలి

– చింతకాయల సత్యనారాయణ, సీనియర్ టైలర్

బాపూజీపురం – మార్టేరు రోడ్డు నిర్మాణం ఎప్పుడో?

- ప్రజల ఎదురుచూపు
- రాకపోకలకు ఇబ్బందులు


పెనుగొండ కాలువగట్టు నుంచి బాపూజీపురం రహదారి దుస్థితి

పెనుగొండ: ఎన్నో ఏళ్లుగా తీరని కలగా పెనుగొండ మార్టేరు కాలువ గట్టు రహదారి పరిసర ప్రాంతాల ప్రజలు నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. నర్సాపురం ప్రధాన కాలువ గట్టు బాపూజీపురం నుంచి మార్టేరు వరకు సుమారు మూడు కిలో మీటర్లుకు పైగా రహదారి పుంత గట్టును తలపిస్తుంది. పెనుగొండలో పెద్ద వంతెన నుంచి బాపూజీపురం వరకు, తిరిగి పెనుగొండ పెద్ద వంతెన నుంచి మార్టేరు వరకు రహదారి ఉంటుంది. ఇందులో పెద్ద వంతెన నుంచి బాపూజీపురం వరకు రహదారి నిర్మాణంపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎన్నోసార్లు వినతులు అందించారు. అయినా, ఫలితంలేదు. పెద్ద వంతెన నుంచి మార్టేరు రహదారిలో వంతెన నుంచి కళాశాల శాంతి నగర్ వరకు సీసీ రోడ్డు నిర్మించారు. అక్కడ నుంచి మార్టేరు వరకు గత 15 ఏళ్ల క్రితం ఎర్ర గ్రావెల్‌తో రహదారి నిర్మించారు. ఐతే, నర్సాపురం ప్రధాన కాలువ ఆధునికీకరణతో రహదారి పూర్తిగా పాడైపోయి, కాలువ మట్టితో నిండిపోయింది. రహదారి మొత్తం పుంత రోడ్డును తలపించే విధంగా మారి పోయింది. అప్పటి నుంచి ప్రజలు నానావస్థలకు గురవుతున్నారు. రహదారి బాగున్నపుడు శాంతినగర్‌లో ఉన్న కళాశాలకు మార్టేరు పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు కాలువ గట్టు రహదారిపైనే వచ్చే వారు. రహదారి చిట్టడవిని తలపిస్తూ పుంతరోడ్డులా ఉండడంతో పడుతూ లేస్తూ రాలేక ప్రధాన రహదారిపై వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిలో సత్యవరం, నెగ్గిపూడి, వనంపల్లిలకు చెందిన ప్రజలు పెనుగొండ రావడానికి సులభంగా ఉంటుంది. దీంతో రహదారి నిర్మాణం ప్రాముఖ్యత నెలకొంది. బాపూజీపురం ప్రజలు సైతం వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు రాకపోవడంతో కాలినడక వంతెనపై మోసుకొంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రైతులు పంటను మిల్లులు చేర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ఘనంగా చండీహోమం

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు వేదపండితులు చండీహోమం నిర్వహించారు. సుమారు 72 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటన


మోగల్లులో పర్యటిస్తున్న సర్వేక్షణ్ కేంద్ర బృందం

పాలకోడేరు: మండలంలోని మోగల్లు గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం మంగళవారం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయాలు, స్కూల్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య పరిస్థితి, మురుగునీరు పారుదల , పచ్చదనం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం జిల్లా టీమ్ లీడర్ ఎం మధుమతి గ్రామంలో వ్యక్తిగత గృహాలను ర్యాండంగా పరిశీలించారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉన్నది లేనిది, ఆ ఇంటి పరిసరాలు, ఇంటి ఆవరణలో ఏమైనా కూరగాయలు పండ్లు పెంచుతున్నారా లేదా అనే అంశాలను కేంద్ర సర్వర్‌తో స్వయంగా సర్వే చేయించారు. వాటితోపాటు గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద చేస్తున్న వర్మీ తయారుచేయడం, తదితర అంశాలను పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ బృంద సభ్యులు జి.రవి కిరణ్, ఎంపీడీవో వి. రెడ్డియ్య , పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో ఎంవీఎస్ రాం ప్రసాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.